# అతిశయం

## భూవరాజు వేంకట మల్లిఖార్జునం

అంటువ్యాధులనేవి ఒకళ్ళ నుండి యింకొళ్ళకి సంక్రమిస్తాయి, ఏవోరకం పురుగులు లేక బాక్టీరియా వల్ల మందేస్తే తగ్గిపోతాయి.

అనూయ అనేది ఒకళ్ళ నుంచి యింకొకళ్ళకి సంక్రమించే వ్యాధి మాత్రం కాదు. అది ఆడవాళ్ళకు పురుగుల వల్లకాక, మూడు ముప్పాతిక సంతులు, పురుషుల కారణంగా వచ్చే ఒక రకమైన వింత వికారం. ఎంత కాదన్నా ఆడవాళ్ళ జన్మహక్కు. కావలసిందేదో యిచ్చేస్తే ఆ అనూయ యిహ వుండదు.

అనుకరణ అనేది ఒక పెద్దకళ. కొండకచో శృతిమించితే, అది పెద్ద జాడ్యం. శృతిమించితే, అంటే ఘంటసాలలా పాడుతున్నాననుకుని పాడటం మొదలెట్టాడనుకోండి. అది మనకు వంటసాలలో ఏవో గిన్నెలు చప్పుడు చేస్తున్నట్లు అనిపించవచ్చు. బెర్నార్డ్‌షాలా వుంటాననుకుని, గెడ్డం పెంచాడను కోండి. పెద్ద బూచాడులా కనిపించవచ్చు. రాజబాబులా నవ్విస్తున్నాననుకుంటాడు ఒకతను. కాని కోతిగంతులేస్తూంటే నవ్వుతారే అలాగే నవ్వుతున్నారనుకోడు. యివన్నీ ఎందుకు? మనకి రోజా, సినిమా తారల కట్టు, బొట్టు, మాట, నడక, అనుకరిస్తూ, ఎంతో మంది తారసపడు తూంటారు. అలాంటి వారిలో మాటికి 99 మందిని చూస్తే చాలా జాలేసి "నీ అందం మూనుకో" అని ఒక అద్దం యివ్వబుద్దేస్తుంది. వెంటనే వాళ్ళు కూడా అలాంటి వెధవ్వేషాలు వెయ్యడం మానే స్తారు.

వీళ్ళంతా ఒక ఎత్తు, అన్నిరకాలు ఒకేచోట మూసలో పోసినట్టు వుండేవాళ్ళ తెగ ఒక ఎత్తు. వీళ్ళే పూరక్కలు పూరకుక్కలు కాదు పూరి స్లష్ అక్కలు.

వీళ్ళ అలావాటేమిటంటే అవతలివాడు ఏం చేస్తే అది చేయాలి. దీనికి ఆస్తి, అంతస్థు అవసరం లేనితో నిమిత్తం లేదు.

కామాక్షమ్మ గారింట్లో పూరీలు చేసుకుంటే, ఎంత రాత్రయినా లేదా మరునాడయినా జానకమ్మ గారింట్లో పూరీలు చేయాల్సిందే.

మీనాక్షమ్మగారు కొత్త సినిమాకి వెళ్ళారని తెలిస్తే, జానకమ్మగారు ఆ రోజే తప్పితే, మర్నాడు మార్నింగ్ షో చూసేయాల్సిందే. సాధ్యమయి నంత వరకూ విడుదల అయిన రోజునే మొదటి

రాజేశ్వరి గారు బజారుకు ఆటోలో వెళ్తారు అంటే జానకమ్మగారు కూడా ఆటోలోనే వెళ్తారు. కావలిస్తే యింట్లో వాళ్ళాయనకిచ్చే ఖర్చులు తగ్గిస్తారు.

అర్ధమయింది కదండి. యిలాంటి జానకమ్మలు యిద్దరు ముగ్గురుంటే యిహ చెప్పొద్దు. ఆ వీధికి ఎంతో హడావిడి, కళ వస్తుంది. మా అమ్మమ్మగారి వూళ్ళో, జానకమ్మ గారితో బాటు యింకో నలుగురు పూరక్కలు వున్నారు అసలే పల్లెటూరు అందుకనే కొత్తదేమైనా వస్తే ఏక వేలంవెర్రి.

ఒకసారి ఏమైందనుకున్నారూ? ఆ వూరుకి సమితి ప్రెసిడెంట్‌గారి భార్య వచ్చింది. ఆవిడకి చక్కటి కళ్ళద్దాలు మంచి అందం తెచ్చాయి. వెంటనే జానకమ్మ గారు అవి ఎక్కడ దొరుకు తాయి అని అడగడం ఆ యిల్లాలు 'అమలాపురం' అని చెప్పడం జరిగాయి.

ఆ సాయంత్రానికే జానకమ్మ అమలాపురం వెళ్ళి, మొత్తం విషయాలన్నీ తెలుసుకుని వచ్చింది. అందరికి సంతోషం కలిగించే విషయమేమిటంటే "కళ్ళజోడు"కి రంగుటద్దాలే కాక మామూలు తెల్లఅద్దాలు కూడా వచ్చాయని. అంతే! ఆ రోజు నుంచి ఒకావిడకి తలనొప్పి యింకో ఆవిడకి 'సైడు' వచ్చేసి, బియ్యంలో రాళ్ళు కనబడటం లేదు. యింకో ఆవిడకి, దగ్గర్నుంచి కాని వాళ్ళాయన ఆనటం లేదు. యింకో ఆవిడకి, అన్నీ రెండుగా కనబడుతున్నాయి. అంతే! పతిదేవుళ్ళు భయపడి, అమలాపురం వెళ్ళి, కళ్ళు పరీక్షచేయించుకుని కళ్ళద్దాలు చేయించుకురమ్మనడం, ఝామ్మని అంతా వెళ్ళి, తెల్లటి చలువ కళ్ళద్దాలు పెట్టుకురావడం కొన్నాళ్ళపాటు అవి ఎంత వుపయోగపడుతు న్నాయో కనబడ్డ వారందరికి శోష వచ్చేంత వరకు చెప్పడం, ఆనవాయితి అయిపోయింది.

యింకోసారి జానకమ్మగారి చెల్లెలు మరిది, బెంగుళూరు నుంచి వచ్చారు. వాళ్ళిద్దరూ మంచి రంగుతో మిసమిసలాడుతూ వుంటే, యిదేదో సబ్బు మహత్యం అయివుంటుంది అనుకుని చెల్లెలిని, ఏదో సందర్భంలో మీరే సబ్బును వాడుతారు అని అడిగింది. మహారాణి సబ్బు అని చెప్పింది చెల్లెలు. అంతే! తను కాకపోయినా, తన మొగుడైనా మిసమిసలాడాలని, చెల్లెలు మరిది వెళ్ళిపోయాక పోరిపోరి ఆ సబ్బుని తీసుకురమ్మంది భర్తని. ఒక ఆదివారం రోజున తనే వాళ్ళాయనకు ఆ సబ్బుతో ఒళ్ళు తల రుద్దింది. నెత్తిమీద నీళ్ళు పోయగానే నెత్తిమీద ఒంటిమీద ఒక్క వెంట్రు కన్నది లేకుండా, మొత్తం నీళ్ళతో కొట్టుకువచ్చింది. జరిగిన దేమిటంటే మహారాణి అనడానికి సర సాటున 'రాజారాణి సబ్బు' తీసుకొచ్చాడు పతిదేవు డు అదీ సంగతి.

ఒకరోజున మధ్యాహ్నం జానకమ్మ తన మిత్రబృందంతో కబుర్లు చెప్పుకుంటున్న సమ యంలో ఒకతను సైకిలుమీద బట్టల మూట పెట్టుకుని, ఆ వీధిలోకి వచ్చాడు. వీళ్ళను చూడగానే కొంచెం కంగారుపడి, మళ్ళీ సర్దుకుని వీళ్ళ ముందునుంచే వెళుతుంటే అతన్ని ఆపారు. కంగారు ఎందుకంటే బట్టల వ్యాపారానికి ముందు స్టెయిన్‌లెస్ స్టీలు పాత్రలు అమ్మకం, వీధివీధికి తిరిగి చేస్తూండేవాడు. వీళ్ళు అతన్ని గంటల తరబడి ఆపి, ఒక్కటి కూడా కొనకుండా రూపాయి సామాను దారుణంగా పావలాకి అడిగి పంపేవారు.

సరే! బట్టల మూట దింపి, సైనున్న పేంటు షర్టు గుడ్డలు తీసాడు. యీ ఆడ జనాభా వెంటనే, రామన్న పండక్కి, తామే మొగుళ్ళకి బట్టలు తియ్యాలనుకుని నిశ్చయించుకుని రెండింటి ఖరీదు చెప్పమన్నారు. అతను రెండు నిమిషాలాలోచించి, పేంటుగుడ్డ 80 రూ.లు, షర్టు గుడ్డ 60 రూ.లు అన్నాడు. వెంటనే యింతకు ముందే చెప్పినట్లు పేంటుగుడ్డ 20 రూం.లకి, షర్టుగుడ్డ 15 రూ.లకి యిస్తావా? అని అడిగారు. కాసేపు గునిసి "సరే తీసుకోండి బోణీ బేరం కాదనలేను" అని

జానకమ్మగారికి రెండు జతలకి, మిగిలిన వాళ్ళకి తలోజతకి బట్టలు యిచ్చి వెళ్తూ "పోనీలే జతకి 10 రూ.లు లాభం వుందికదా అనుకుంటూ వెళ్ళిపోయాడు.

యింక యింటికి వెళ్ళగానే తాముచేసిన ఘనకార్యం చెబుతూ తామెంత బాగా బేరమాడ గలరో ఖర్చు సంగతి వాళ్ళ కొదిలేస్తే ఎంత పొదుపు చేయగలరో చెబుతూ అప్పటికప్పుడు కుట్టించ టానికి యిచ్చికాని నిద్రపోలేదు.

ఇహ పండగనాడు కవలపిల్లల్లాగా నలుగురి

భర్తలు కొత్త బట్టలేసుకుని తిరుగుతూ వుంటే ఎవరు ఎవరిమొగుడో అన్నంత అనుమానం వచ్చి, ఒకళ్ళని పిలవబోయి యింకోకళ్ళని పిలిచి బోల్డంత సిగ్గుపడిపోయి పండగ సంబరమంతా మొహాల్లోకే తెచ్చేసుకున్నారు.



పండగ మర్నాడు, జానకమ్మగారు, రెండు బట్టలు వులికి, మళ్ళీ యిస్త్రీ చేయిద్దామనుకుని, నీళ్ళలో ఒక పావుగంట వేసి నానబెట్టి, వుతుకుదామని చొక్కా బయటకుతీసే సరికి అంతా పీచుపీచులా అయిపోయి అసలు చొక్కారూపు లేకుండా పోయింది. యిహ పేంటు యిస్త్రీ చేసి, వాళ్ళాయని కిస్తే పేంటు మోకాలు వరకు వచ్చి చుట్టుకొలత కూడా సగానికి కుదించిపోయింది. యిలా అయింది అంతే రెండో జత వుతక్కుండా ఒకసారి తొడగ్గానే జాగ్రత్తగా యిస్త్రీచేసి, పెట్లో దాచేసి మళ్లీ ఏ ఆరునెల్లో తొడుక్కుని, మళ్ళీ వుతక్కుండా యిస్త్రీ చేయించి యిలాగ వాటి రూపురేఖలు చెడకుండా ఏడాదిన్నర పాటు వాడారు. యీ ఏడాది లోపులో వాళ్ళాయన కొలతల్లో ఏమైనా మార్పు వుంటే ఆ తప్పు ఆ బట్టలది మాత్రం కాదు.

యింత దూరం వచ్చేముకదా! జానకమ్మగారికి పరిచయం చేసుకుని యింటర్వ్యూ చేసాను. ఆ విశేషాలు మీకోసం క్రింద పొందుపరుస్తున్నాము.

నన్ను చూస్తూనే "రండిరండి" అంటూ ఆహ్వానించింది బల్లమీద టిఫిన్ ప్లేటు కాఫీ గ్లాసు నేను చూడటం లేదనుకుని బల్లక్రిందకు తోసేస్తూ.

"నా పేరు జానకీ ఉత్తరకుమార్. ఆయన అలా పంచాయితీ మీటింగ్‌కి వెళ్లారు" అంది. నేను వంటింట్లోకి చూస్తూంటే వంటింటి తలుపు వేస్తూ.

"మీ గురించి, మీ వారి గురించి, ఏమైనా చెప్పండి అన్నాను."

"వారు నా మాటకి ఎంతో విలువిస్తారు. నన్నెప్పుడూ జానీ, జానీ అనిపిలుస్తారు. నేను దగ్గరుంటే, ఆయనకి వేరే 'జానీవాకర్' అక్కర్లేదుట. అందుకని ఒప్పుకున్నాను. సంసారం అన్న తరువాత ఒకళ్ళ యిష్టాలని, యింకోళ్ళు మన్నించాలి. నా మటుకు నేను యింటి విషయాలు మాత్రమే అంటే యింట్లో డబ్బు ఎలా, ఎంత ఖర్చుచేయాలి యిలాంటివి చూసుకుంటాను. ఆయన చూసుకునే బయట విషయాలు అంటే రాజకీయాలు వూళ్లో వాళ్ళ విషయాలలో నేను కలగజేసుకోను. నా మాటకి ఎంతో విలువనిస్తూ 'నువ్వు చెప్పింట్లే చేస్తాను' అంటారు. నేనేం చెప్పినా. యిదే మా ఆదర్శ దాంపత్యానికి మూల రహస్యం అంటూ వివరించిందా యిల్లాలు ఎంతో సిగ్గుపడుతూ.

హోమియోపతీ మందులంటే చాలా నమ్మకం నాలుగు నెలల క్రితం యిక్కడి గిన్నె అక్కడ పెట్టలేకపోయేదని హోమియోవాడిన తరువాత ఎంతో బలంవచ్చి మొన్నవాళ్ళాయన్ని ఏదో విషయంలో సరసంగా చేయిలాగితే ఆ కీలు అక్కడకు వూడిపోయిందని నవ్వుతూ చెప్పారు జానకమ్మగారు.

సిగరెట్టు, బీడి అంటే తెగ అసహ్యం కాని చుట్టంటే యిష్టంట. పెళ్ళయ్యాక కూడా కొన్నాళ్ళు కాల్చారుట. అది వాళ్ళ జిల్లాలో అలవాటు కనుక పెద్ద తప్పు కాదు అని చెబుతూ తరువాత ఆయన సర్దన్నారనిమానేసి తన భర్త మీద వున్న ప్రేమను నిరూపించుకుందిట.

మీకెంత మంది పిల్లలు? అన్న ప్రశ్నకి అబ్బే యింకా ఎవరూ లేరండి. ఏదో మానవ ప్రయత్నం చేస్తున్నాము. యింక ఆ దైవం కూడా అనుగ్రహించాలి కదా! అయినా యిదో రకంగా ప్రభుత్వానికి కుటుంబ నియంత్రణకి తోడ్పడి, ప్ర[illegible] సేస్తున్నామనే సంతోషంగా వుంది అ[illegible] జానకమ్మ.

"మీ వారిని కూడా చూడాలని వుంది" అంటే ఆయన రావడానికి ఆలస్యం అవుతుంది. ఆ ఫోటోలో వున్నాయనే మా ఆయన అన్నారు.

నా మొహంలో మార్పుచూసి, మా యిద్దరికి వయసులో చాలా తేడా వుందనుకుంటున్నారు కదూ! నేను నా శరీరాన్ని అంత బాగా సంరక్షించుకుంటాను అన్నారు సిగ్గుపడుతూ.

"వస్తానండి! అని చెప్పి గుమ్మం దగ్గరకు వెళ్ళి, ఎందుకో వెనక్కు తిరిగాను. ఆమె, తన కట్టుడు పళ్ళు తీసి బల్లమీద పెడుతుంది. గుమ్మం దాటగానే ఎవరో కూరగాయల సంచి ఒక చేత్తో, బియ్యం సంచి ఒక చేత్తో ఎదురయ్యారు... ఎవరో ఏమిటి? ఆయన 'వుత్ర(ర)కుమారే! ●